క్లుప్తంగా

విద్యా ప్రగతిపై సమీక్ష



పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో హెచ్ఎంలతో సమీక్షిస్తున్న ఎంఈఓ ప్రసాద్

పెదవేగి : మండలం పరిధిలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులందరూ పాఠశాలల్లోని విద్యార్థులందరికీ అపార్ రిజిస్టర్‌ను పూర్తి చేయాలని పెదవేగి మండల ఇన్‌చార్జి ఎంఈఓ ఎవీఎస్‌వీ ప్రసాద్ సూచించారు. మంగళవారం పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఎంఈఓ పాఠశాలల్లో విద్యా ప్రగతి, విద్యార్థుల హాజరు శాతం, ఉపాధ్యాయుల పనితీరుపై సమీక్షించారు.

నారాయణపురంలో దంత వైద్య పరీక్షలు



నారాయణపురంలో దంత వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

ఉంగుటూరు: నారాయణపురం రైతు భవన్‌లో ఉచిత దంత వైద్యశిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచి దిడ్ల అలకానంద శ్రీనివాసు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు అడపా శ్రీను, వీరాచారి, మానవత అధ్యక్షుడు పుసులూరి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. ప్రజలు ఈ వైద్య శిబిరానికి హాజరై పరీక్షలు చేయించుకున్నారు.

పది మంది జూదరుల అరెస్ట్

దెందులూరు: సానిగూడెంలో మంగళవారం ఓ ఇంట్లో కొందరు పేకాట ఆడుతున్నారని సమాచారంతో అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేసినట్టు ఎస్సై ఆర్. శివాజీ తెలిపారు. సానిగూడెంలో పేకాట శిబిరం వద్ద 10 మందిని అదుపులోకి తీసుకున్నామని ఆయన తెలిపారు. జూదరుల వద్ద నుంచి రూ.20,700 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై తెలిపారు.

పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యత




ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న జిల్లా ఎస్పీ కేపీ శివకిషోర్

ఏలూరు టౌన్: జిల్లా పోలీస్ శాఖలో పని చేస్తోన్న పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని, విధుల్లో ఉంటూ మృతిచెందిన పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటామని ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో అనారోగ్యంతో మృతిచెందిన ఎస్సై డి.నరసింహారావు కుటుంబ సభ్యులకు కార్పస్ ఫండ్‌గా రూ.1లక్ష చెక్కును మంగళవారం జిల్లా ఎస్పీ చేతులమీదుగా అందజేశారు. ఏలూరు సీసీఎస్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన నరసింహారావుకు ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలు త్వరితగతిన అందజేసేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. ఇప్పటికే ఆయన కుమారుడికి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం కల్పించగా మంగళవారం ఆర్థిక సహాయన్ని భార్య పద్మావతి, కుమారుడు సుందర్‌కు అందజేశామని తెలిపారు.

ఆన్‌లైన్ లావాదేవీలపై అప్రమత్తత తప్పనిసరి

ఏలూరు(మెట్రో): ఆన్‌లైన్ లావాదేవీలపై ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని స్టేట్‌బ్యాంక్ రీజనల్ మేనేజర్ నోరి ఎల్‌కేఎంవీ ప్రసాద్ అన్నారు. ఏలూరు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ కార్యాలయం ఆధ్వర్యంలో అంబికా కన్వెన్షన్ టౌన్‌హాల్‌లో సమావేశం నిర్వహించారు. డిజిటల్ బ్యాంకింగ్‌పై ఖాతాదారులు అవగాహన పెంచుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఏలూరు ఆర్‌బీవో జీఎం (ఆపరేషన్స్) కె.లలిత పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



జెడ్పీ సీఈవో(ఎఫ్ఏసీ) విజయరాజును కలిసిన ఏపీఎస్‌టీపీ నాయకులు

ఏలూరు(మెట్రో): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీఎస్‌టీపీ) నాయకులు జెడ్పీ సీఈవోను కోరారు. మంగళవారం ఇటీవల జెడ్పీ సీఈవో (ఎఫ్ఏసీ)గా బాధ్యతలు స్వీకరించిన ఆర్.విజయరాజును ఏపీఎస్‌టీపీ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జీజేఏ స్టీవెన్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాటి వెంకటరమణ, తోటప్రసాద్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మధ్యాహ్న భోజనానికి ధరల సెగ

- మండుతున్న నిత్యావసర సరుకుల ధరలు
- కూటమి ప్రభుత్వంలో సక్రమంగా మంజూరుకాని బిల్లులు
- మెనూ చార్జీలు పెంచాలని ఎండీఎం నిర్వాహకుల వేడుకోలు



పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న చిన్నారులు (ఫైల్)

దెందులూరు: నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకూ పెరుగుతూ కొనుగోలుదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. ఉల్లి, నూనెలు, కూరగాయల ధరలు ఆకాశన్నంటుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇదే పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలను ప్రభుత్వం అదుపు చేయకపోవడంతో ప్రజలు జేబులు గుల్లవుతున్నాయి. మరోవైపు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు నిత్యావసరాల ధరాఘాతంతో విలవిల్లాడుతున్నారు. మెనూ ప్రకారం ఆహారం పదార్థాల తయారీకి విపరీతంగా ధరలు పెరిగిన కూరగాయలు, ఆకుకూరలు, ఉల్లిపాయలు, నూనెలు కొనలేక ఆర్థికంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం ఇచ్చే మెనూ ఛార్జీల కంటే నిర్వాహకులకు అవుతున్న ఖర్చు ఎక్కువగా ఉంటోంది. దీంతో మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ నిర్వాహకులు నష్టాలను భరిస్తూ విద్యార్థులకు వండి పెడుతున్నారు. మెనూ చార్జీలు పెంచాలని ఎండీఎం నిర్వాహకులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

రెండు నెలలుగా బిల్లులు బకాయిలు

ధరల మోతతో పాటు రెండు నెలలుగా మధ్యాహ్న భోజన పథకం బిల్లులు రాకపోవడంతో నిర్వాహకులు అప్పు చేసి ఏజెన్సీలను నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలకు ఏ నెల బిల్లులు ఆ నెల చెల్లించేవారు. ఇప్పుడు పరిస్థితి అందుకు విరుద్ధంగా మారింది.

ప్రభుత్వం చెల్లిస్తున్న మెనూ ఛార్జీల వివరాలు

ప్రస్తుతం నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకం మెనూ ఛార్జీలు ఇలా ఉన్నాయి. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ఒక్కొక్క విద్యార్థికి రూ.5.88, 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు రూ. 8.57 ప్రభుత్వం నిర్వాహకులకు చెల్లిస్తోంది. ఈ ఏడాది ప్రారంభం నుంచి నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు విపరీతంగా పెరుగుతూ ఆకాశాన్నంటాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 6 నెలలు గడిచినా ఇంతవరకు మధ్యాహ్న భోజన పథకం నిర్వహణకు సంబంధించి మెనూ ఛార్జీలు పెంచలేదు. ధరలు పెరగడం వల్ల ఏజెన్సీ నిర్వాహకులకు ఖర్చు పెరిగిపోవడంతో కొన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో నాణ్యత తగ్గింది. దీంతో విద్యార్థులకు గతంలో మాదిరిగా పౌష్టికాహారం అందే పరిస్థితి లేదు.

నియోజకవర్గం పరిధిలో పాఠశాలలు- విద్యార్థుల వివరాలు

మండలం	పాఠశాలలు	విద్యార్థులు
దెందులూరు	63	1,409
పెదవేగి	95	1,000
పెదపాడు	77	2,168
ఏలూరు రూరల్	57	8,398

మెనూ ఇలా

- సోమవారం : వేడి పొంగల్, ఉడికించిన కోడి గుడ్డు/ కూరగాయల పులావ్, గుడ్డు కూర, వేరుశెనగ చిక్కీ
- మంగళవారం : పులిహోర, టమోట పచ్చడి/ రాగి జావ, దొండకాయ పచ్చడి, ఉడికించిన కోడిగుడ్డు
- బుధవారం: కూరగాయలతో అన్నం, బంగాళ దుంప కుర్మా, ఉడికించిన గుడ్డు, వేరుశెనగ చిక్కీ
- గురువారం: నిమ్మకాయ పులిహోర, సాంబార్ బాత్, ఉడికించిన గుడ్డు, రాగిజావ
- శుక్రవారం: అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, వేరుశెనగ చిక్కీ
- శనివారం : ఆకుకూర అన్నం, పప్పుచారు, తీపి పొంగలి, రాగిజావ వంటివి విద్యార్థులు వడ్డించాల్సి ఉంది.

మినీ గోకులాలపై శిక్షణ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ శాంతారాం

దెందులూరు: ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మినీ గోకులాల మంజూరు, స్థలం కొలతలు నమోదు చేయాలని రాష్ట్ర సీనియర్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ శాంతారాం అన్నారు. దెందులూరు ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, బీఎఫ్‌ల జిల్లా సమావేశం నిర్వహించారు. కొలతల నమోదులో ఉపాధి సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలన్నారు. ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా సంబంధిత ఉద్యోగులు బాధ్యత వహించాలన్నారు. మండల డివిజన్ జిల్లా అధికారుల నిరంతర పర్యవేక్షణ నూరు శాతం ఉండాలన్నారు. ఈ ప్రక్రియ ఆద్యంతం తనిఖీలు నిర్వహిస్తామని ఆయన అన్నారు. శిక్షణ సమావేశానికి జిల్లా వ్యాప్తంగా ఉపాధి సిబ్బంది హాజరయ్యారు.

అరుదైన జాతి పశువులు, పక్షుల సంరక్షణ

- భోగాపురం వాసి అమెరికాలో ఉంటూ పశుపక్ష్యాదుల సంరక్షణ బాధ్యత
- కట్నేని నళినీమోహన్ తోటలో పుంగనూరు ఆవు, దూడలు



అరుదైన పుంగనూరు జాతి ఆవు, దూడలు



వివిధ జాతులకు చెందిన గుర్రాలు



సిల్క్ జాతి కోళ్లు



వివిధ రకాల బాతులు, టర్కీ కోళ్లు



వివిధ జాతులకు చెందిన పావురాలు



ఇంగ్లాండ్‌కు చెందిన గుర్రపు బండి

పెదవేగి : దేశంలోనే అత్యంత అరుదుగా కనిపించే పుంగనూరు జాతి ఆవులను పశ్చిమగోదావరి జిల్లాలోని పెదవేగి మండలం భోగాపురంలోని కట్నేని నళిని మోహన్ సంరక్షిస్తున్నారు. ఈ జాతి ఆవులు పూర్తిగా అంతరించిపోకూడదన్న ఆలోచనతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కొంతమంది రైతులకు ఈ జాతి ఆవులను ఇచ్చారు. ఇవి ప్రస్తుతం గుంటూరు జిల్లాలో 3, పశ్చిమగోదావరి జిల్లాలో 2 ఆవులు ఉన్నాయి. వీటి ఎత్తు మూడు అడుగులు, వెడల్పు 4 అడుగులు ఉంటాయి. భోగాపురంలోని పుంగనూరు జాతి ఆవు ఒక గిత్తదూడ కొద్ది రోజుల క్రితం జన్మనిచ్చింది. రావుబహదూర్ కట్నేని పెరుమాళ్లు జమిందారీ కుటుంబంలోని 5వ తరానికి చెందిన నళినీమోహన్ మూగ జీవాలపై ఉన్న ప్రేమతో తన తోటలో 25 రకాలకు చెందిన 250 పావురాలు, గిన్నె కోళ్లు, టర్కీ కోళ్లు, సిల్క్ కోళ్లు, ఇతర వివిధ రకాల జాతులకు చెందిన కోళ్లను సంరక్షిస్తున్నారు. వివిధ జాతులకు చెందిన 5 గుర్రాలు, ఒంగోలు, కపిల ఆవులు ఉన్నాయి. నెలకు రూ.50 వేలకు పైగా ఖర్చు చేసి ఇద్దరు కాపరులను నియమించి వాటిని సంరక్షిస్తున్నారు. గుంటూరు నుంచి ఈ పుంగనూరు జాతికి చెందిన ఆవులను తీసుకువచ్చారు. ఈ ఆవుల పాలల్లో ప్రత్యేక పోషక విలువలు ఉంటాయని, ఈ జాతిని ఆవులు అంతరించిపోకుండా వాటిని సంరక్షిస్తున్నామని నళినీమోహన్ ఫోన్‌లో తెలిపారు. ప్రసుత్తం ఆయన అమెరికాలో ఉంటూ తన తోటలోని మూగ జీవాల సంరక్షణకు అవసరమైన ఏర్పాట్లు చేసి ఇంటర్‌నెట్ సాయంతో ప్రతి రోజూ పర్యవేక్షిస్తున్నారు. వివిధ పశువులతో పాటు ఇంగ్లాండ్‌కు చెందిన గుర్రపుబండి, హైదరాబాద్ నవాబ్‌కు చెందిన గుర్రపు బండి ఆయన సేకరించి తన తోటలో భద్రపర్చారు.

ఆయిల్‌పామ్ పరిశోధన కేంద్రంలో క్షేత్ర పర్యటన



పెదవేగి ఆయిల్‌పామ్ పరిశోధన కేంద్రాన్ని సందర్శించిన విద్యార్థులు

పెదవేగి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు మంగళవారం క్షేత్ర పర్యటనలో భాగంగా పెదవేగిలోని భారతీయ ఆయిల్ పామ్ పరిశోధన కేంద్రాన్ని సందర్శించారు. కళాశాల మొదటి సెమిస్టర్ బీఏ, బీకాం, బీఎస్సీ విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర బృందం ఈ క్షేత్ర పర్యటనలో పాల్గొన్నారు. ఆయిల్ పామ్ పరిశోధన కేంద్రంలోని వివిధ విభాగాలను సందర్శించి అనేక విషయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబు మాట్లాడుతూ క్షేత్ర పర్యటనలో భాగంగా ప్రతిష్టాత్మకమైన ఆయిల్ పామ్ పరిశోధన కేంద్రాన్ని సందర్శించడం ద్వారా విద్యార్థులు ప్రేరణ పొందుతారని అన్నారు. ఈ సందర్భంగా క్షేత్ర పర్యటన ఏర్పాటు చేయడంలో ప్రధాన పాత్ర పోషించిన ఆంగ్లోపన్యాసకులు వి వెంకట్ రావుని అభినందించారు. పరిశోధన కేంద్రం డైరెక్టర్ కంచర్ల రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని సరైన మార్గంలో శ్రమిస్తే విజయం సాధిస్తారన్నారు. అనంతరం సమీపంలోని ఆయిల్ పామ్ తోటను విద్యార్థులు పరిశీలించారు. క్షేత్ర పర్యటనలో కళాశాల సీపీడీసీ మెంబర్ ఎల్ వెంకటేశ్వరరావు వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం రాంబాబు, అధ్యాపకులు వి.వెంకట్రావు, ఎం.విజయ్‌కుమార్, ఎస్ పరమేశ, టీవీఎస్ పద్మావతి, ఎం కృష్ణ చైతన్య, టి వెంకటదుర్గాప్రసాద్, ఎస్ సుస్యలత, డి సుజాత అధ్యాపకేతర బృందం ఎస్ లక్ష్మి, విజయరాణి అన్నాదురై, నాగవేణి పాల్గొన్నారు.

వరి పంట కోయవద్దు

దెందులూరు: మండలం పరిధిలోని రైతులు వరి కోతలు కోయవద్దని దెందులూరు మండలం వ్యవసాయ శాఖ అధికారి దామా వెంకటేశ్వర్లు సూచించారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఈనెల 28, 29, 30 తేదీల్లో భారీ వర్షం కురిసే అవ కాశం ఉందని ఆయన అన్నారు. అధికారులు హైఅలర్ట్ ప్రకటించారని రైతులు బుధవారం నుంచి వరి కోతలు నిలుపుదల చేయాలని కోరారు.

కార్మికుల జీతాలు పెంచాలి

ఏలూరు (టూటౌన్): జీతాల పెంపుదల కోసం గౌతమి ఆగ్రోస్ ఇండస్ట్రీస్ కార్మికులు చేపట్టిన ఆందోళనకు సీఐటీయూ ఏలూరు జిల్లా కమిటీ పూర్తి మద్దతు తెలియజేస్తుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బి. సోమయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గౌతమి ఆగ్రోస్ ఇండస్ట్రీస్ యాజమాన్యం తక్షణమే స్పందించి కార్మికుల జీతాల పెంపుదల,ఇతర న్యాయమైన కోరికలను పరిష్కారం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

రాజ్యాంగాన్ని గౌరవించడం అందరి బాధ్యత



వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



భీమడోలులో జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



ఉంగుటూరు ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



భీమడోలులో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, అధికారులు



గణపవరం డిగ్రీ కాలేజీలో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



దెందులూరులో బీఆర్ అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తహసీల్దార్ సుమతి, సిబ్బంది

గణపవరం: ఎంతో పవిత్రమైన రాజ్యాంగానికి లోబడి నడుచుకోవడం, రాజ్యాంగాన్ని గౌరవించడం ప్రతి భారతీయుడి బాధ్యత అని ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. మంగళవారం రాజ్యాంగాన్ని ఆమోదించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రాజ్యాంగాన్ని తుంగలోకి తొక్కి అప్రజాస్వామిక విధానాలను అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తికి తీరని విఘాతం కలిగిస్తోందని దుయ్యబట్టారు. విపక్ష పార్టీలను, కార్యకర్తలను, నాయకులను, సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి, పోలీసుల దాడులతో వేధింపులకు గురిచేస్తోందని విమర్శించారు. రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కులకు తీవ్ర భంగం కలిగిస్తూ కూటమి ప్రభుత్వం అరాచక పాలన కొనసాగిస్తోందని ఆయన విమర్శించారు. దీనికి తగిన ప్రతిఫలం అనుభవించక తప్పదని హెచ్చరించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నిడమర్రు మండల సమన్వయకర్త పుప్పాల కన్నబాబు, నిడమర్రు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సమయం వీరరాఘవులు, బువ్వనపల్లి సర్పంచ్ కిలారి సత్యవతి రవిబాబు, ఉపసర్పంచ్ వెల్లంకి నరేష్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్, గ్రామ కమిటీ అధ్యక్షుడు సంకు శ్రీను, నాయకులు గొట్టుముక్కల విశ్వనాథరాజు, నడింపల్లిధర్మ, అలుమోలు గంగారామ్, మారిశెట్టి వెంకట్ పాల్గొన్నారు.

ప్రతి పౌరుడికీ సమాన హక్కులు

ఉంగుటూరు : దేశంలోని ప్రతి పౌరుడికీ కులమతాలకు అతీతంగా రాజ్యాంగం సమానమైన హక్కులు కల్పించిందని ఉంగుటూరు ఎంపీడీవో రాజ్‌మనోజ్ అన్నారు. మంగళవారం 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని ఎంపీడీవో కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎంపీడీవో మాట్లాడుతూ భారత రాజ్యాంగం విశిష్టతను వివరించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల అవసరాలను తీర్చగలిగేది రాజ్యాంగమేనని అన్నారు. యువత హక్కులు, బాధ్యతలు తెలుసుకుని దేశ ప్రగతికి పాటుపడాలని ఎంపీడీవో సూచించారు. రాజనీతి శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రెడ్డియ్య, డాక్టర్ కొండ రవి, నిర్మల్ జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి రాజ్యాంగం దీపం

భీమడోలు: ప్రజాస్వామ్యానికి రాజ్యాంగం దీపమని పలువురు వక్తలు అన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, శాఖా గ్రంథాలయాల్లో 75వ రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా జాతీయ న్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. భీమడోలులో ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి అధికారులతో కలిసి రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు. గుండుగొలను-1, భీమడోలు-4 ప్రాథమిక పాఠశాల్లో హెచ్ఎంల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. భీమడోలులో జాతీయ జెండాతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు ఆధ్వర్యంలో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవంలో మానవత సంస్థ జిల్లా డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంఈవో 2 అయినపర్తి భాస్కర్‌కుమార్, హెచ్ఎం పాశం పాండురంగారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగు రాజ్యాంగ ప్రతుల ఆవిష్కరణ

ఉంగుటూరు: నారాయణపురం కాలేజీ రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. సర్పంచి దిడ్ల అలకానంద ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, మాజీ జెడ్పీటీసీ కాటి కిరణ్ తదితరులు పాల్గొన్నారు. తెలుగులో రాసిన రాజ్యాంగ ప్రతులను ఈ సందర్భంగా ఆవిష్కరించి పంపిణీ చేశారు.

ప్రతి విద్యార్థి రాజ్యాంగాన్ని చదవాలి

గణపవరం: రాజ్యాంగాన్ని ప్రతి విద్యార్థి చదవాలని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజి ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ పి.మధురాజు అన్నారు. మంగళవారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా గణపవరం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిగ్రీ కాలేజీలో ఎన్ఎస్ఎస్ 1,2 యూనిట్ల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు టి.అక్కిరాజు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు జి.వెంకటరమణ, భాస్కరరావు విద్యార్థులతో రాజ్యాంగానికి విధేయులుగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు.

బీఆర్ అంబేడ్కర్ చిరస్మరణీయులు

దెందులూరు: రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిరస్మరణీయులని దెందులూరు తహసీల్దార్ బి.సుమతి అన్నారు. మంగళవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి తహసీల్దార్‌తోపాటు, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణస్వామి, ఆర్ఐ హేమమాలిని, వీఆర్వోలు నివాళులర్పించారు. గోపన్నపాలెం వ్యాయామ విద్యా కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. నత్తానియేలు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ రతన్‌బాబు, సాయికోటి తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొవ్వలి ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఎస్ఎల్ఎన్ జీవీ శర్మ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు.

అపార్ గుర్తింపు కార్డుల నమోదుపై ప్రత్యేక శ్రద్ధ



ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించిన ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, ఎంఈవో భాస్కర్‌కుమార్

భీమడోలు: విద్యార్థులకు అపార్ గుర్తింపు కార్డులను త్వరితగతిన పూర్తి చేసేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి అన్నారు. భీమడోలు ఉన్నత పాఠశాలలో ఆధార్ సవరణలకు వీలుగా ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, కళాశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల అపార్ ఐడీ నమోదును వేగవంతం చేసేందుకు మండలంలోని మూడు చోట్ల ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. భీమడోలు, గుండుగొలను ఉన్నత పాఠశాలల్లో, భీమడోలు బీఎస్ఎన్ఎల్ భవనాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసామన్నారు. ఆధార్‌లో సవరణలు చేయించుకునేందుకు ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంబంధిత పత్రాలను కేంద్రాలకు తీసుకెళ్లాలని సూచించారు. మండల వ్యాప్తంగా 90 శాతం అపార్ ఐడీ ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. విద్యార్థుల ఆధార్ సవరణల విషయంలో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో 2 అయినపర్తి భాస్కర్‌కుమార్, ఇన్‌చార్జి హెచ్ఎం అహ్మద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయంలో వేదిక నిర్మాణానికి విరాళం అందజేత

దెందులూరు: ప్రసిద్ధి గాంచిన గాలాయగూడెంలోని అచ్చమ్మపేరంటాలమ్మ తల్లి ఆలయంలో వేదిక విస్తరణ పనులకు ఎస్ఎంఆర్ పెదబాబు రూ.5 లక్షల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. 1974లో అమ్మవారి ఆలయానికి పెదబాబు తండ్రి షేక్ మస్తాన్‌వలీ పేరుతో వేదిక నిర్మించారు. భక్తుల సౌకర్యార్థం వేదికను విస్తరించి అభివృద్ధి చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరడంతో ఆయన రూ.5 లక్షలు విరాళం అందించారు.